సాక్షి సిద్దిపేట

శనివారం । 17 । మే । 2025



ఆటలాడేటోళ్లం..

బాల్యపు జ్ఞాపకాలు నేటికీ మధురస్మృతులని సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. వివరాలు IIలో ▸



నాటారు.. నరికారు

హరితహారంలో నాటిన మొక్కలు విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని యథేచ్ఛగా నరికివేస్తున్నారు. వివరాలు IIలో ▸



ఆయిల్‌పామ్‌తో..

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారి సూచిస్తున్నారు. వివరాలు IIIలో ▸

తనిఖీలు సరే.. రికవరీ ఏదీ?



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపాధిలో అక్రమాలు వెలుగు చూస్తున్నా చర్యలు అంతంతే

- 2018–25 వరకు 38వేల పనుల్లో అవకతవకలు
- రూ.6.71 కోట్ల గోల్‌మాల్ జరిగినట్లు నిర్ధారణ
- అయినా ఇప్పటి వరకు రూ.1.34కోట్లే స్వాధీనం
- ఇంకా పెండింగ్‌లోనే రూ.5.36కోట్లు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రతీ ఏటా ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించి అవకతవకలను వెల్లడిస్తారు. కానీ బాధ్యుల నుంచి సొమ్ము రికవరీ చేయడం లేదు. 2018 నుంచి 2025 మార్చి వరకు జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.6.71కోట్లు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. కానీ రికవరీ అంతంత మాత్రంగానే జరుగుతోంది. దీంతో అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

■ మద్దూరు మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు ఉపాధిహామీ పథకంలో రూ.9.60 కోట్లతో చేసిన 1122 పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. జనవరి 9న మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీలో లక్షలాది రూపాయలు అక్రమాలు జరిగినట్లు తేల్చారు. పని జరగకపోయినా పని జరిగినట్లు రికార్డుల్లో పొందుపర్చడం, మస్టర్‌లో సంతకాలు లేకుండా చెల్లింపులు చేయడం, తక్కువ పనికి ఎక్కువ చెల్లింపులు జరిగినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. కానీ రికవరీ జాడలేదు.

■ మిరుదొడ్డి మండలంలో మార్చి 17న ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024–25లో రూ.2.03,463 అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికీ రెండు నెలలు కావస్తున్నా రికవరీ కాలేదు.

సాక్షి, సిద్దిపేట: గ్రామీణ పేదలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. ఉపాధి హామీ పనులలో భాగంగా గ్రామ పంచాయతీల్లో నర్సరీల పెంపకం, మొక్కలు నాటడం, చెరువులు, కుంటలు, బావుల్లో పూడిక తీయడం, కల్లాల నిర్మాణం చేపడుతున్నారు. పనుల్లో పారదర్శకత పాటించేందుకు సామాజిక తనిఖీ విధానాన్ని తీసుకవచ్చారు. ఏ స్థాయిలో అవినీతి జరిగినా ప్రజావేదికలో తెలిపోనుంది. పనుల్లో నాణ్యత లేకపోయినా అడిగేవారు కరవయ్యారు. అవకతకలు గుర్తిస్తున్నా మార్పు కనిపించడం లేదు.ఈ పథకంలో ఎక్కువగా కాంట్రాక్ట్ సిబ్బంది ఉండటంతోనే నిధుల దుర్వినియోగం ఆగడం లేదు.



మిరుదొడ్డిలో ఉపాధి హామీ పనుల పై సామాజిక తనిఖీలు (ఫైల్)

రూ.5.36 కోట్లు పెండింగ్

జిల్లా వ్యాప్తంగా 1.97లక్షల జాబ్ కార్డులుండగా 3.94 లక్షల మంది ఉపాధి కూలీలున్నారు. జిల్లాలో ప్రతీ ఏడాది ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తుంటారు. 2018– 25 వరకు 38,722 పనుల్లో జరిగిన అవకతవకల్లో రూ.6,71,42,134 అక్రమార్కులు సొంతానికి వాడుకున్నట్లు తనిఖీల ద్వారా బయటపడింది. వీటిలో ఇప్పటి వరకు కేవలం రూ.1,34,86,250 మాత్రమే రికవరీ అయ్యాయి. ఇంకా రూ.5,36,55,884 రికవరీ పెండింగ్‌లో ఉంది. సామాజిక తనిఖీలపై పెట్టిన దృష్టి మండల స్థాయి అధికారులు రికవరీపై పెట్టకపోవడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. రికవరీ లేకపోవడంతో ఉత్తుత్తి సామాజిక తనిఖీలుగానే మిగిలిపోతున్నాయి.

నో ఫీల్డ్ విజిట్..

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విజిట్‌లు చేయకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా చేస్తున్నారు. కూలీలు పనులు చేయకున్నా... చేసినట్లు రికార్డు చేస్తున్నారు. అంతేకాకుండా పనులు ఎక్కడ చేస్తున్నారనేది అధికారులకు తెలియడం లేదు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు దృష్టి సారించి ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

ప్రత్యేక డ్రైవ్ చేపడతాం



ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నాం. వాటిలో తేలిన అవకతవకలను బహిర్గతం చేస్తున్నాం. గోల్‌మాల్ జరిగిన డబ్బులను రివకరీ కోసం ప్రత్యేక డ్రైవ్‌ను త్వరలో ఏర్పాటు చేస్తాం. రెండు నుంచి మూడు నెలల్లో దాదాపు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తాం.

–జయదేవ్, డీఆర్‌డీఓ

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. మూల మహోత్సవం



వర్గల్ సరస్వతి మాత దివ్య మంగళరూపం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం శుక్రవారం మూల మహోత్సవ వైభవంతో అలరారింది. చదువుల తల్లికి భక్తజన సామూహిక లక్షపుష్పార్చన నేత్రపర్వం చేసింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి నేతృత్వంలో వేదపండితులు తెల్లవారుజామున అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు, పూలమాలికలు, ఆభరణాలతో అలంకరించారు. సామూహిక లక్షపుష్పార్చన చేశారు. చండీ హోమం నిర్వహించారు. పలువురు చిన్నారులు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసాలు చేశారు. భక్తులు వేడుకలు తిలకించి తరించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్షయ నివారణకు కృషి చేయాలి



పీహెచ్‌సీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి శ్రీనివాస్

నంగునూరు(సిద్దిపేట): నంగునూరును క్షయ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రామ్ జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ముండ్రాయి, రాజగోపాల్‌పేట, పాలమాకుల గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి టీబీ రోగుల వివరాలు సేకరించారు. రెండు వారాలు మించి దగ్గు, జ్వరం ఉంటే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రజిత, సంతోష్, మహేందర్, ఆశ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి వాసికి ప్రధాని మోదీ అభినందనలు



ఫ్లైట్ లెఫ్టినెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డితో కరచాలనం చేసి అభినందిస్తున్న ప్రధాని మోదీ

జహీరాబాద్: భారత వైమానిక దళంలో పని చేస్తున్న సంగారెడ్డి జిల్లావాసి పట్లోళ్ల లక్ష్మీకాంత్‌రెడ్డిని ప్రధాని మోదీ అభినందించారు. కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం భారత వైమానిక దళంలో చేరి ప్రస్తుతం ఫ్లైట్ లెఫ్టినెంట్ ర్యాంక్ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన అప్రకటిత యుద్ధం నేపథ్యంలో మిగ్ యుద్ధ విమానం, గగనతల రక్షణ వ్యవస్థ సుదర్శనచక్ర ఎస్–400ను ధ్వంసం చేశామని పాక్ చెప్పిన విషయాలు అవాస్తవమని నిరూపించేందుకు ప్రధాని మోదీ పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లి దాని ఎదుటే నిల్చుని ప్రసంగించారు. ఆ సందర్భంలో అక్కడే ఉన్న లక్ష్మీకాంత్‌రెడ్డిని ప్రధాని మోదీతో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా భారత జవాన్లనుద్దేశించి 'మీ మెరుపు వేగం, కచ్చితత్వం శత్రువులను నిశ్చేష్టులను చేసిందని, భారతీయులంతా మీ పోరాటానికి ఉప్పొంగి పోయార'ని ప్రధాని అభినందించారు. ప్రధానితో కరచాలనం చేసి, అభినందనలు పొందడం తమకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని లక్ష్మీకాంత్‌రెడ్డి తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

విద్యాభివృద్ధే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ తదితరులు

- జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి
- ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి
- దిశా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేటరూరల్: 'విద్యాభివృద్ధే లక్ష్యం కావాలి. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా కృషి చేయాలి. విద్యారంగంలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి' అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మెదక్ ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షతన దిశా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్షించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందరూ ఒక సామాజిక బాధ్యతగా తీసుకొని విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

సంక్షేమ ఫలాలు అందరికీ చేరాలి

అనంతరం ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రజలు అధికంగా లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 16, 17వ ఎంపీ నిధుల ద్వారా మంజూరై పూర్తికాని పనులు, నిధుల వివరాలను అందించాలన్నారు. తొగుట మండలంలో ఇరిగేషన్ కాలువల తవ్వకం వల్ల వచ్చిన మట్టి, రాళ్లను ప్రజల ఉపయోగం కోసం కొంత రుసుంతో ఇవ్వాలన్నారు. ఎన్సాన్‌పల్లి ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాతీయ రహదారి పై ఓవర్ నిర్మిస్తున్నామన్నారు. దివ్యాంగుల ఉపకరణాలను పంపిణీ చేయడానికి ప్రత్యేక క్యాంపులు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా విద్యార్థులతో సమావేశం నిర్వహించి కౌన్సెలింగ్ కల్పించాలన్నారు. దుబ్బాకలో న్యాక్ వారి సహకారంతో ప్రజలు విదేశాలలో కూడా ఉపాధి పొందేలా వివిధ కోర్సులలో ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే టెన్త్ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళికబద్ధంగా విద్యాబోధన చేయాలన్నారు.

కమిషనర్ గైర్హాజర్‌పై ఆగ్రహం

సిద్దిపేట మున్సిపాలిటీ కమిషనర్ దిశా సమావేశానికి రాకపోవడంపై ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం అండర్‌గ్రౌండ్ నిర్మాణానికి అందించిన నిధులు, పనుల వివరాలను చర్చించేందుకు కమిషనర్ రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దిశ సమావేశానికి హాజరైన ఆయా శాఖల అధికారులు

డ్రై డే పాటిద్దాం

ఫైలేరియా సీనియర్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్

సిద్దిపేటకమాన్: ప్రతి శుక్ర, మంగళవారాల్లో డ్రై డే పాటించాలని ఫైలేరియా సీనియర్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలో వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వినియోగంలో లేని వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్‌లు, ప్రభుత్వ ఆసుపత్రులలో డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది

వైభవంగా శేషవాహనోత్సవం



శ్రీవారి శేషవాహన సేవలో భక్తజనం

వర్గల్(గజ్వేల్): వేణుగోపాలుని కోవెలలో స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం అర్చకులు మూలవిరాట్టులకు విశేష అభిషేకం జరిపి, కమనీయంగా అలంకరించారు. సుదర్శన మూలమంత్ర హవనం నిర్వహించారు. రాత్రి స్వామివారు దేవేరులతో కలిసి శేషుని పడగనీడలో పురవీధుల గుండా ఊరేగారు. నేత్రపర్వంగా సాగిన శేషవాహనోత్సవ సేవలో భక్తులు పాల్గొని తరించారు. స్వామివారి ఆశీస్సులు పొందారు.

పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోండి

సిద్దిపేటఎడ్యుకేషన్: మై భారత్ పౌర రక్షణ వలంటీర్లుగా యువత తమ పేర్లు నమోదు చేసుకోవాలని నెహ్రూ యువకేంద్ర ఉమ్మడి జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఊహించని పరిస్థితుల్లో ప్రతి స్పందించేలా వలంటీర్లకు శిక్షణను అందిస్తారని పేర్కొన్నారు. భద్రతా సమస్యల దృష్ట్యా బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకునేందుకు వలంటీర్లు ముందుకు రావలని సూచించారు. రెస్క్యూ ఆపరేషన్, తరలింపు కార్యక్రమాలు, ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్, జన సమూహ నియంత్రణ, ప్రజా భద్రత, విపత్తు ప్రతిస్పందన, పునరావాస ప్రయత్నాల్లో సహాయం చేయడం తదితర కార్యకలాపాలను వలంటీర్లు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉన్న వారు మై భారత్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9650889829 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన విద్యను అందిద్దాం

పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిద్దామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు అన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం, ఏఐ శిక్షణ తరగతులు, స్కూల్ యూనిఫామ్‌ల తయారీ, ఉపాధ్యాయ శిక్షణ తరగతులను, కేజీబీవీ సమ్మర్ క్యాంప్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి యూనిఫామ్‌లు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు తమ బోధనను మరింత మెరుగుపర్చుకోవడానికి ప్రత్యేక శిక్షణ తరగతులు దోహదపడుతాయన్నారు. కార్యక్రమాలలో జిల్లా కమ్యూనిటీ మోబిలైజింగ్ అధికారి రంగనాథ్, శిక్షణ తరగతుల నిర్వహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న కృష్ణారావు

నీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు



రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు

దుబ్బాకరూరల్: తిమ్మాపూర్‌లో మంచినీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. మూడు రోజులుగా నీరు సరఫరా జరగకపోవడంతో ఆగ్రహించి ఖాళీ బిందెలతో శుక్రవారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మూడు రోజుల నుంచి మంచి నీళ్లు రావడం లేదని, దీంతో వంట కూడా చేసుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. నీటి సమస్య తీర్చాలని వారు కోరారు.



పీజీ కళాశాలను సందర్శించిన ఓయూ ప్రతినిధుల బృందం

పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సు

ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మొలుగురం కుమార్

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కళాశాలలో త్వరలో ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు ఓయూ వైస్ చాన్స్‌లర్ మొలుగురం కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓయూ పీజీ కళాశాలను ఓయూ బృందం పతినిధులు సందర్శించారు. కళాశాలలో ప్రొఫెసర్లు, విద్యార్థులతో ముచ్చటించారు. కళాశాలలో ఉన్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో సీట్ల సంఖ్య పెంచనున్నట్లు తెలిపారు. అనంతరం ఓయూ ప్రతినిధుల బృందం కలెక్టర్ మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఓయూ పీజీ కళాశాలలోని సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితెందర్ కుమార్ నాయక్, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర నాయక్, మౌలికసదుపాయాల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజశేఖర్ రెడ్డి, యూనివర్సిటీ పీజీ (ఓయూ) కళాశాల సమన్వయకర్త డాక్టర్ రవినాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూడెకరాల భూమి ఏమాయె

- పాలకుల నిర్లక్ష్యం వల్లే సాగు నీరు రాలే
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): నిరుపేదలకు మూడెకరాల సాగు భూమి హామీ నేటికీ అమలు కావడం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో మండల మహాసభ నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు కోసం సీపీఐ నిరంతర అండగా ఉంటుందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడం కాదని, గిట్టుబాటు ధరను రైతులే ప్రకటించేలా హక్కులు కల్పించాలన్నారు. ఉద్యమాలు, ఎర్రజెండాలకు కేరాఫ్ హుస్నాబాద్ నియోజకవర్గమన్నారు.

ఉద్యమాల ఫలితమే గౌరవెల్లి, గండిపల్లి..

తాగు, సాగు నీరు కోసం ఎర్రజెండా నీడలో అనేక ఉద్యమాల ఫలితమే గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులని చాడ అన్నారు. కానీ నేటి పాలకులు గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కాలువల నిర్మాణానికి సుమారుగా రూ.431కోట్లు మంజూరైనట్లు చెప్పి ఏడాది గడుస్తున్నా పనులు మాత్రం చేపట్టకపోవడంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రాంతానికి సాగు నీరు రాలేదని మండిపడ్డారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సీపీఐ సత్తాచాటాలని, ఆదిశగా ప్రతి కార్యకర్తలు సైనికులా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు జాగిరి సత్యనారాయణ, ఎడల వనేష్, జనార్దన్, కోయ్యడ కోమురయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పార్టీ ఫిరాయింపుల చట్టం అమలు చేయాల్సిందే

హుస్నాబాద్: చట్ట సభలకు ఎన్నికై పార్టీలను ఫిరాయిస్తున్న ప్రజాప్రతినిధులపై ఫిరాయింపుల చట్టాన్ని అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య వాదులు రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. న్యాయ వ్యవస్థకు పూర్తి స్థాయిలో స్వేచ్ఛ ఉండాలన్నారు. అధికారుల్లో అవినీతి పెరుకుపోయిందన్నారు. గౌరవెల్లి. గండిపెల్లి ప్రాజెక్టుల సామర్థ్యాన్ని అనవసరంగా పెంచారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటతోపాటు వడియారం గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. నాలుగు రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి సన్నబియ్యం నాణ్యతను పరిశీలించారు. రికార్డుల్లోని స్టాక్ లెక్కలు దుకాణంలో ఉన్న స్టాకుతో సరిగా ఉన్నాయా లేదా అని చూసారు. ఈ సందర్భంగా డీలర్లు కొన్ని దొడ్డు బియ్యం బస్తాలు వస్తున్నాయని, తూకంలో తరుగు వస్తుందని అధికారులకు తెలిపారు. గోదాంలలో తూకం వేసుకొని నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని అధికారులు సూచించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

తూప్రాన్: పెళ్లి అయిన 30 ఏళ్ల తర్వాత అదనపు కట్నం వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యాదగిరి వివరాల ప్రకారం... మండలంలోని మాల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటోళ్ల బాలమణి, కిష్టయ్యలకు 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా కిష్టయ్య రెండేళ్లుగా మద్యానికి బానిసై నిత్యం వేధిస్తున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

జహీరాబాద్ టౌన్: విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని రంజోల్‌లో చోటు చేసుకుంది. తయాబ్ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు తీగకు కరెంట్ సరఫరా అవుతోంది. అటుగా వెళ్లిన ఎద్దులకు సపోర్టు తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాయి. సపోర్టు తీగకు కరెంట్ సరఫరా అవుతుందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఫంక్షన్ హాల్‌కు ప్రజలు వస్తుంటారని, ఎవరైనా సపోర్టు తీగకు తాకితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

గుండారంలో జింక సంచారం

– అటవీ అధికారులకు అప్పగించిన గ్రామస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గుర్రాల శ్రీధర్‌రెడ్డి మామిడి తోటలో శుక్రవారం జింక స్వల్ప గాయాలతో అస్వస్థతకు గురై కనిపించింది. ఎండ వేడికి తట్టుకోలేక దప్పికై తోటలోకి నీటి కోసం వచ్చి ఉంటుందని పేర్కొన్నారు. గమనించిన శ్రీధర్‌రెడ్డి స్థానికులతో కలిసి ఫారెస్ట్ బీట్ అధికారులకు సమాచారమిచ్చారు. గ్రామానికి వచ్చిన బీట్ ఆఫీసర్ శ్రవణ్‌రెడ్డి, టీఏ నరేష్‌లకు జింకను అప్పగించారు. మాజీ ఉపసర్పంచ్ రాము, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, తిరుపతి ఉన్నారు.


ధాన్యం కుప్పను ఢీకొని వ్యక్తికి గాయాలు

గజ్వేల్‌రూరల్: రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని జాలిగామ సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చిట్యాల కర్ణాకర్ గజ్వేల్‌లోని ఓ వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. దినచర్యలో భాగంగా ఈనెల 14న వాటర్‌ప్లాంట్‌లో పనిముగించుకొని రాత్రి సమయంలో తన ద్విచక్ర వాహనంపై గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలోని పత్తిమిల్లు వద్ద రోడ్డుపై పలువురు రైతులు ఆరబోసిన వరి ధాన్యంను కుప్పలుగా చేసి వాటిపై నల్ల కవర్‌ను కప్పి రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న వడ్లకుప్పను ఢీకొని గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీకి తీసుకెళ్లారు. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటలాడేటోళ్లం.. అల్లరి చేసేటోళ్లం

ఎన్నో మధురస్మృతులు.. ఎన్నెన్నో బాల్యపు జ్ఞాపకాలు

సమ్మర్ స్పెషల్



మాట్లాడుతున్న సిధారెడ్డి

- వేసవి సెలవులు వచ్చాయంటే రెండు నెలలు పండుగే
- నాడు బావిలో పడిపోతే బాల్యమిత్రుడు పోచయ్య కాపాడిండు
- 'సాక్షి'తో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి

సాక్షి, సిద్దిపేట: 'బాల్యపు జ్ఞాపకాలు నేటికీ మధురస్మృతులు.. వేసవి సెలవులు వచ్చాయంటే మాకు పండుగే.. ఆటలు ఆడేటోళ్లం.. అల్లరి చేసేటోళ్లం.. వేసవి సెలవులొస్తే దాదాపు రెండు నెలలు స్నేహితులతో సరదాగా గడిపే వాళ్లం' అని రచయిత, ఉద్యమకారుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. సిధారెడ్డి తన బాల్యంలోని వేసవి జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే.. సిద్దిపేట మండలం బంధారం గ్రామం మాది. మా ఊరులో పాఠశాల లేకపోతే వెల్కటూరుకు వెళ్లే వాళ్లం. వెల్కటూరు ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సమయంలో దాహం వేస్తే మేము బావుల దగ్గరికి, ఎవరి ఇంటికైనా వెళ్లి నీళ్లు తాగి వచ్చే వాళ్లం. ఒక రోజు నాకు బాగా దాహం వేయడంతో బావి దగ్గరికి వెళ్లాను. దరి తెలియకపోవడంతో జారి బావిలో పడిపోయాను. అప్పుడు నాకు ఈత రాదు, నేను చనిపోయాను అనుకున్నా.. నన్ను వెతుక్కుంటూ నా బాల్య మిత్రుడు పోచయ్య వచ్చాడు. వెంటనే నన్ను చూసి బావిలోకి దూకి కాపాడారు. అప్పుడు పోచయ్య నన్ను కాపాడకపోతే నేను బతికేవాడిని కాదు. అలా నాకు పోచయ్య ప్రాణదాత అయ్యాడు. ఇది నా జీవితంలో మరచిపోని సంఘటన.

దొంగచాటుగా మామిడి కాయలు తెంపుకునేటోళ్లం

మేము దాదాపు 10 మంది కలిసి వెళ్లే వాళ్లం. ఓ ఇద్దరు అక్కడ కాపాలా ఉండే వారితో ముచ్చట పెడుతుంటే మరికొందరు తోటలోకి వెళ్లి మామిడి కాయలు, అల్లనేరేడు పండ్లు తెంపుకొచ్చేవాళ్లు. అప్పుడు ఫోన్‌లు సైతం సరిగా లేవు. మా ఊరు బంధారానికి కరెంటే లేదు. ఇప్పుడు చిన్న పిల్లలందరూ ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్‌లు ఇవ్వకుండా పర్యాటక ప్రాంతాలు చూపించాలి. ఫిజికల్ యాక్టివిటీస్ చేపించాలి. మంచి పుస్తకాలు చదువుకునే విధంగా ప్రోత్సహించాలి.



స్నేహితులే ఈత నేర్పారు..

పరీక్షలు అయిపోయి.. రిజల్ట్ తీసుకోగానే వేసవి సెలవులు దాదాపు రెండు నెలలు ఎంజాయ్ చేసేవాళ్లం. 6వ తరగతిలో జరిగిన సంఘటనతో నాకు స్నేహితులు ఈత నేరిపించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈత కొట్టేవాళ్లం. ప్రతి రోజు ఉదయం పూట నేను వడ్ల సత్తయ్య, మధుసూదన్, పోచయ్య, బాల్‌నర్సయ్య, అంజిరెడ్డి, ఆగంరెడ్డి ఇలా దాదాపు 10 మంది కలిసి ఈతకు వెళ్లాం. తిండి తిప్పలు మానేసి ఈత కొట్టాం. బావిలో ముట్టించుకునే ఆటలు ఆడేటోళ్లం. ఇంటికిపోయే సమయంలో ఎండకు కాళ్లు కాలుతుంటే మోదుగు ఆకులు, సీతాఫలం కొమ్మలతో కలిపి చెప్పులాగా కుట్టుకొని రక్షణ పొందాం. సాయంత్రం చిర్రగోనే, తాటి ముంజలతో బండి, చింతగింజల ఆట, గోటీలు ఆడేటోళ్లం.

కానిస్టేబుల్ దాడి చేశాడంటూ ఆందోళన

ఎక్సైజ్ ఆఫీస్ ఎదుట హనుమాన్ మాలధారుల ధర్నా



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హనుమాన్ మాలధారులు, బీజేపీ నాయకులు

హుస్నాబాద్: హనుమాన్ మాల ధరించిన భక్తుడిపై ఎక్సైజ్ కానిస్టేబుల్ దాడి చేశారంటూ శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మాలధారులు ధర్నా చేశారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ మాల ధరించిన శివప్రసాద్ పట్టణంలోని ఓ వైన్స్ షాపునకు సంబంధించిన సిట్టింగ్ పర్మిట్ రూంలో పని చేస్తున్నాడని తెలిపారు. అయితే మద్యం తాగేందుకు ఎక్సైజ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి పర్మిట్ రూంకు వచ్చాడు. గ్లాసులు కావాలని కోరగా, శివప్రసాద్ గ్లాస్‌లు ఇచ్చి డబ్బులు అడిగాడు. నేను ఎవరో తెలుసా, డబ్బులు అడుగుతావా.. వైన్స్ షాపును సీజ్ చేయిస్తానని బెదిరించి శివ ప్రసాద్‌పై దాడి చేశాడని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మాలధారులు ధర్నా నిర్వహించి కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సై మహేష్ వచ్చి కానిస్టేబుల్ పై చర్యలు తీసుకుంటానని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్ బాబు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, మాలధారులు ఉన్నారు.

ఏపీ ఈసెట్‌లో సత్తా చాటిన విద్యార్థినులు

స్టేట్ ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సొంతం



విద్యార్థినులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఏపీ ఈసెట్ ఫలితాల్లో ఒకే మండలం ఒకే గ్రామానికి చెందిన విద్యార్థినులు ప్రభంజనం సృష్టించారు. ఇటీవల విడుదలైన రాష్ట్ర స్థాయి ఫలితాల్లో మొదటి, రెండవ ర్యాంకులను సాధించి ఔరా అనిపించారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట -భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కట్లె యాదగిరి, కవిత దంపతుల కూతురు రేవతి, అలాగే పంజ నర్సింలు, చెన్నవ్వల కూతురు నవ్య ఏపీ ఈసెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని ఈసీఈ విభాగంలో మొదటి, రెండో ర్యాంకులు సాధించి జిల్లాకే తలమానికంగా నిలిచారు.

కూలి కుటుంబంలో ఆణిముత్యాలు

రెక్కాడితే గాని డొక్కాడని కూలీ కుటుంబంలో జన్మించిన రేవతి, నవ్య టీఎస్‌ఆర్‌జేసీ ఎన్సానపల్లిలో పది వరకు చదివి గవర్నమెంట్ ఎలక్ట్రానిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ సికింద్రాబాద్‌లో డిప్లొమా పూర్తి చేశారు. రేవతి తండ్రి వ్యవసాయ కూలీ పనులు చేయగా తల్లి బీడీలు చుడుతూ తన బిడ్డను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. అలాగే పంజ నర్సింలు చెన్నవ్వల కూతురు నవ్యను హమాలి, వ్యవసాయ కూలీ పనులు చేస్తూ చదివిస్తున్నారు. తల్లిదండ్రులు తమ చదువు కోసం పడుతున్న కష్టాలకు చలించి ఉన్నత చదువులే లక్ష్యంగా చదివి కలల సాకారాన్ని సాధించుకున్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల విద్యార్థిలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

చెరువు కట్టపై గొడవ

- ఇరువర్గాలపై కేసు నమోదు
- 17 మంది బైండోవర్



నిందితులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ నీరేష్

చేర్యాల(సిద్దిపేట): చెరువుకట్టపై కొట్టుకున్న కేసులో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి 17 మందిని బైండోవర్ చేశారు. ఈ ఘటన శుక్రవారం చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నీరేష్ వివరాల ప్రకారం.. ఈ నెల 13న ఓ గొడవ విషయమై ఇరు వర్గాలు మాట్లాడుకుందామని పట్టణ కేంద్రంలోని చెరువుకట్ట మీదికి వచ్చారు. ఈ క్రమంలో ఓ వర్గంలోని వ్యక్తి మరో వర్గం వారిపై దాడి చేశాడు. బాధిత వర్గం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా దాడికి పాల్పడిన వ్యక్తి వర్గానికి సంబంధించిన 17 మందిని శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం



సుశీలమ్మ

పటాన్‌చెరు టౌన్: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు సుశీలమ్మ (86) ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆమెకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కరికి రూ.1,500, మరో ఆరుగురికి రూ. వెయ్యి, అదేవిధంగా మరో ఆరుగురికి రూ. 500, ఇద్దరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు.

కారు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన ఈరమ్మ

రాయికోడ్ (అందోల్): నీళ్లు తాగేందుకు బైక్ ఆపగా వెనకనుంచి వేగంగా వచ్చిన కార్ ఢీకొట్టడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని యూసుఫ్ పూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు.. రేగోడ్ మండలం జగిర్యాల గ్రామానికి చెందిన ఎస్.బస్వరాజ్ తల్లి ఈరమ్మతో కలిసి బైక్‌పై మునిపల్లి మండలం పిల్లోడి గ్రామంలో శుభాకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దాహం వేయగా యూసుఫ్ పూర్ గ్రామ శివారులో బైక్ ఆపి మంచి నీళ్లు తాగుతున్న సమయంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన ఎర్టిగా కార్ బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో ఈరమ్మ తలకు బలమైన గాయాలయ్యాయి. జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరుడు వీరశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ

- బడీడు పిల్లలంతా బడిలో చేరాలి
- స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మదన్ మోహన్

మెదక్ కలెక్టరేట్ : ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను రిసోర్స్‌పర్సన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే బడి బయట ఉన్న పిల్లలను బడిబాటలో భాగంగా పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందించాలని మండల విద్యాధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం పోషకుల సమావేశం నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి



వాకర్స్ ఆధ్వర్యంలో వినూత్నరీతిలో ఏర్పాటు చేసిన సందేశాత్మక గోడ

సిద్దిపేటజోన్: దేశ సరిహద్దు రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని సిద్దిపేట మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. శుక్రవారం స్థానిక కోమటిచెరువు నెక్లెస్ రోడ్ వద్ద వినూత్నంగా గ్రాటీట్యూట్ వాల్(సందేశాత్మక గోడ) ఏర్పాటు చేశారు. భారత్, పాకిస్తాన్ మధ్య ఇటీవల జరిగిన యుద్ధం నేపథ్యంలో మన దేశం, మన సైనికులపై ఉన్న అభిమానాన్ని గోడ మీద ఉన్న వస్త్రంపై అతికించారు. టూటౌన్ సీఐ ఉపేందర్ సైతం తన కుటుంబ సభ్యులతో కలిసి సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్ కుమార్, శ్రీనాథ్,శివ కుమార్, కిరణ్, గణేష్, సతీష్, రమేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

విద్యలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారుతుందని, ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య అన్నారు. సిద్దిపేట జిల్లాలో వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను శుక్రవారం డీఈవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన సమస్యల పట్ల పోరాటం చేస్తూనే బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించాలనే తపన, విద్యార్థుల నిరంతర అభివృద్ధికి వారు చేసే కృషి అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు బహుముఖ పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య అందివాలని, పిల్లల నమోదు పెంచాలని ప్రయత్నం చేస్తోందని, దానికి ప్రతి ఉపాధ్యాయుడు తన వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఏకీకృత సరీస్సు నిబంధనల సాధనకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, తిరుపతి, శ్రీనాకర్ రెడ్డి, సింగోజి జనార్దన్, నర్సిరెడ్డి , బాలకిషన్, ఉమాశంకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాటారు.. నరికారు

ఆకుపచ్చని పల్లెలను సృష్టించాలని గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో ప్రతి ఏటా వేల సంఖ్యలో మొక్కలు నాటించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవంతో దానిని కొనసాగిస్తోంది. అలాగే మొక్కలు నాటేందుకు గ్రామానికి ఒక నర్సరీని ఏర్పాటు చేసి ఉపాధి హామీ పథకంలో భాగంగా విత్తనాలు సేకరించి మొక్కలు పెంచుతున్నారు. కానీ కొంతమంది అధికారులు మాత్రం ఏపుగా పెరిగిన చెట్లను విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని నరికేస్తున్నారు. గుట్టలు తవ్వడంతో అక్కడ ఉన్న చెట్లు సైతం ధ్వంసమవుతున్నాయని ప్రకృతి ప్రేమికులు భగ్గుమంటున్నారు.

- హరితహారంలో నాటిన మొక్కలకు గండం
- విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని నరికేస్తున్నారు
- తైదల గుట్టపై మట్టి తవ్వకాలు..
- ధ్వంసమైన 6వేల టేకు చెట్లు
- భగ్గుమంటున్న ప్రకృతి ప్రేమికులు

హుస్నాబాద్ రూరల్: మండలంలోని నాగారం తైదలగుట్ట, ఉమ్మాపూర్ ఊరు ఏనల సమీపంలోనే ఆయా గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. అడవి సమీప గ్రామాలు కావడంతో నాగారం, ఉమ్మాపూర్, పోతారం(ఎస్) గ్రామాల ప్రజలు గుట్టలపై ఎక్కువగా మొక్కలు నాటారు. నాగారం ప్రభుత్వ భూమిలోని సర్వే నం.54లోని గుట్టపై 10 వేల టేకు మొక్కలను విడుతల వారీగా నాటారు. గుట్టలకు మట్టి తీయడంతో 6 వేల పైచిలుకు టేకు చెట్లు ధ్వంసమయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విలువైన మొక్కలు ఉన్నాయని, మట్టి తీయద్దని గ్రామస్తులు అడ్డుపడితే.. ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలిచ్చి తప్పుకున్నారు. ఇక్కడి మట్టిని హన్మకొండ జిల్లాలోని నేషనల్ హైవే రోడ్డు పనులకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపించారు. ఉమ్మాపూర్ అటవీ ప్రాంతానికి వెళ్లే దారిలో నాగారం, పోతారం(ఎస్) మధ్య ఉన్న బైరాన్ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. పక్కనే ఉన్న తైదల గుట్ట నుంచి వైకుంఠధామం, నర్సరీ వరకు మట్టి తవ్వకాలు జరపడంతో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



అక్కన్నపేట రోడ్డులో చెట్లను నరికిన దృశ్యం

విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని..

గ్రామాల రోడ్లు పచ్చదనంతో ఉండాలని అవెన్యూ ప్లాంటేషన్ కింద అధికారులు మొక్కలు నాటిస్తే అవి వృక్షాలై బాటసారులకు నీడను అందిస్తున్నాయి. వానాకాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. నరికిన చెట్ల కొమ్మలను రోడ్డుపై వేయడంతో ఆర్టీసీ బస్సుల అద్దాలకు గీసుకొని గీతలు పడి ధ్వంసమవుతున్నాయని డ్రైవర్లు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నాగారం వైకుంఠధామం, నర్సరీ హద్దుల వరకు జరిపిన మట్టి తవ్వకాలు

10వేల మొక్కలు నాటాం



ఉమ్మాపూర్, నాగారం గుట్టలకు 10వేల మొక్కలు నాటాం. పల్లెల్లో పచ్చదనం పెరగాలని అటవీ ప్రాంత గ్రామాల్లో ఎక్కువ మొక్కలు నాటించాం. నాటిన ప్రతి మొక్కనూ కూలీలు, వన సంరక్షకులు నీళ్లు పోసి పెంచారు. టేకు వృక్షాలైతే గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తుందని ఎక్కువ మొక్కలు నాటించాం. కానీ గుట్టపై మట్టి తీయడంతో ఆ మొక్కలు ధ్వంసమయ్యాయి.

– పద్మ, ఏపీఓ ,హుస్నాబాద్

అనుమతులతోనే తరలించారు



నేషనల్ హైవే రోడ్డు పనుల కోసం మైనింగ్ అనుమతులు తీసుకొని మట్టి తవ్వకాలు జరిపారు. అనుమతులకు మించి మట్టి తవ్వకాలు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు నాగారం గుట్టపై మట్టి తవ్వకాలను నిలిపివేశాం.

– రవీందర్ రెడ్డి, తహసీల్దార్, హుస్నాబాద్